సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ◆ 9 ◆ సెప్టెంబర్ ◆ 2025

తెలంగాణ భాష.. యాసే శ్వాస



తెలంగాణ సంస్కృతి, సాహిత్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. కాళోజీ స్ఫూర్తితో ఈ ప్రాంత రచయితలు ప్రత్యేకత చాటుతున్నారు. నేడు తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



ఆశాజనకంగా సోయా

జిల్లాలో సోయా పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఫిర్యాదుల విభాగం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. 17 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

ఎస్పీకి సన్మానం

జిల్లాలో గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపట్టిన ఎస్పీ అఖిల్ మహాజన్‌ను బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కృషిమిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు రాణాప్రతాప్ సింగ్, బ్రహ్మ సతీశ్, భావన, ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని నాందేడ్ రైల్వే డివిజనల్ మేనేజర్ ప్రదీప్ కామ్లేకు తెలంగాణ స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జగదీష్ అగర్వాల్ విన్నవించారు. సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. పిట్‌లైన్ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. అలాగే రైల్వేఅండర్, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీటిపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాఘవేంద్రనాథ్ యాదవ్, అధ్యక్షుడు సంతోష్, సుభాష్ జాదవ్, అమర్ జార్జ్ తదితరులున్నారు.

ఐటీఐ గురువులకు రాష్ట్రస్థాయి అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని ఐటీఐ కళాశాలకు చెందిన పలువురు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లకు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. సోమవారం హైదరాబాద్‌లోని రెడిల్స్‌లో ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదిలాబాద్ ఐటీఐ ప్రిన్సిపాల్ పద్మ శ్రీనివాస్, ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపాల్ రొడ్డ శ్రీనివాస్ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డులు అందుకున్నారు. అలాగే ఉత్తమ ట్రైనర్లుగా ఉట్నూర్‌కు చెందిన పులి రాంచందర్, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లుగా మధుసూదన్, జగదీష్ అవార్డులు పొందారు. వీరికి రాష్ట్ర ఉపాధి కార్మిక శిక్షణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ అవార్డులను ప్రదానం చేశారు.

అభ్యంతరాలొచ్చాయి

- 'పరిషత్' ముసాయిదా జాబితాపై..
- పోలింగ్ స్టేషన్ల విషయంలోనే అధికం
- రాజకీయ పార్టీల నుంచి విజ్ఞప్తులు
- రేపు తుది జాబితా ఖరారు



తాంసి మండలపరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీవో మోహన్‌రెడ్డి

సాక్షి,ఆదిలాబాద్: ప్రాదేశిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 6న ముసాయిదా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించగా వాటికి సంబంధించి అభ్యంతరాలను సోమవారం వరకు స్వీకరించింది. పలుచోట్ల ప్రజల నుంచే కాకుండా రాజకీయ పార్టీల నుంచి కూడా విజ్ఞప్తులు అందాయి. పరిశీలన అనంతరం అధికారులు రేపు తుది జాబితా ఖరారు చేయనున్నారు.

అభ్యంతరాలు ఇలా..

- బేల మండలం భాది గ్రామపంచాయతీ పరిధిలో ఏటి గ్రామం ఉంది. అక్కడ సుమారు 300 మంది ఓటర్లు ఉన్నారు. పరిషత్ ఎన్నికలకు సంబంధించి వీరు భాది గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే ఏటి నుంచి భాదికి 3 కిలోమీటర్ల పిల్లతోవ ఉంది. మరో మార్గంలో మసాల(బి), ఎకోరి, బేల, సిర్సన్న గ్రామాలు దాటి 8 కిలోమీటర్ల దూరంలో పక్కా మార్గం ఉంది. అయితే అధికారులు మాత్రం పిలతోవను పరిగణలోకి తీసుకొని వారికి భాదిలోనే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ మార్గంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా ఈ విషయంలో విజ్ఞప్తి చేశారు. అయితే తక్కువ మంది ఓటర్లు ఉండడంతో సాధ్యం కాదనేది అధికారులు చెబుతున్నది. అలాంటప్పుడు ఎన్నికలు జరిగేరోజు ఒకవేళ భారీ వర్షాలు కురిసిన పక్షంలో ఈ ఓటర్లు అక్కడివరకు ఎలా వెళ్లేది.. ఓటు ఎలా వేసేది.. అనే సందిగ్ధం ఎదురవుతుంది. కాగా, గ్రామాలకు అర కిలోమీటర్ దూరంలోనే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తమ జాబితాల్లో స్పష్టంగా పేర్కొంటుండడం గమనార్హం.
- ఇది ఒక్క ఈ గ్రామమే కాదు.. జిల్లాలో ఇలా అనేక గ్రామాలకు పోలింగ్ స్టేషన్ దూరంగా ఉండడంతో ఓటు వేసే విషయంలో మదనపడుతున్నారు. ఆయా గ్రామస్తులు తమ గ్రామంలోనే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని చెబుతున్నప్పటికీ తక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండడంతో ఏమి చేయలేమని అధికారులు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తుంది.
- బోథ్ మండలం జీడిపల్లి గ్రామానికి ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు వినతి పత్రం అందించారు.
- బేల మండలంలో సిర్సన్న, చప్రాల గ్రామాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ సంఖ్యలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒక్కొక్కటి చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల నుంచి విజ్ఞప్తులు అందాయి.

ఈనెల 6న పరిషత్ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా జాబితాను అధికారులు జారీ చేశారు. అందులో మండలాల వారీగా వివరాలు వెల్లడించారు. గ్రామపంచాయతీ వారీగా ఎన్ని పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి..

రేపు తుది జాబితా..

అందులో ఓటర్లు ఎంతమంది ఉన్నారు.. వంటి వివరాలను వెల్లడిస్తూ అర కిలోమీటర్ పరిధిలోనే ఆయా గ్రామాలకు పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో అటు ప్రజల నుంచి, ఇటు రాజకీయ పార్టీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అనేక సమస్యలు ఉన్నప్పటికీ కేవలం తక్కువ మంది ఓటర్లు ఉన్నారనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని పోలింగ్ కేంద్రాలను పెంచే విషయంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారని చెబుతున్నారు. ఒకవేళ వాతావరణ పరిస్థితులు అనుకూలించని పక్షంలో ఆయా గ్రామస్తులు ఎలా ఓటు వేసేది అనే విషయంలో సందిగ్ధం ఎదురవుతుంది.

పరిశీలించి పరిష్కరిస్తాం..

ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల గడువు సోమవారంతో ముగిసింది. జిల్లాలోని కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు అందాయి. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం. మరికొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలు పాత భవనాల్లో కొనసాగుతుండడంతో కొత్త భవనాల్లోకి మార్చాలని కోరారు. ఈ సమస్యను కూడా పరిష్కరిస్తాం.

– జి.జితేందర్ రెడ్డి, జెడ్పీ సీఈవో

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా
- ప్రజావాణికి 68 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి 68 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో కొందరి నివేదిన..

పెండింగ్ వేతనాలు ఇప్పించండి



మేమంతా జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నాం. మాకు ఆరు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. వాటిని త్వరగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

– రెవెన్యూ శాఖ కంప్యూటర్ ఆపరేటర్లు

పునరావాసం కల్పించండి



1989లో అప్పటి సీఎం ఎన్టీఆర్ మాకు ఇళ్లు కట్టించారు. పదేళ్ల తర్వాత మా కాలనీని ఆనుకుని చెరువు కట్ట నిర్మించారు. ప్రారంభంలో ఇబ్బంది లేకున్నా పదేళ్లుగా అవస్థలు తప్పడం లేదు. కట్టబలహీనంగా మారడంతో వర్షాకాలంలో భయభయంగా గడుపుతున్నాం. మమ్ములను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఇంటిస్థలాలు మంజూరు చేసి పునరావాసం కల్పించేలా చూడాలని విన్నవించుకుంటున్నాం.

– జవహర్‌నగర్ కాలనీవాసులు, బజార్‌హత్నూర్

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి



మేమంతా 40 ఏళ్లుగా గ్రామంలో కూలీనాలి చేసుకుంటూ నివసిస్తున్నాం. మాకు ఇంటి స్థలం తప్ప ఎలాంటి వ్యవసాయ భూములు కానీ, ఇండ్లు కానీ లేవు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నాం.

– కినార్‌పల్లి గ్రామస్తులు, బజార్‌హత్నూర్

వేతనాలందక తిప్పలైతంది..



మేమంతా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులుగా సేవలందిస్తున్నాం. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం. అవి కూడా మూడు నెలలుగా చెల్లించడం లేదు. కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారింది. వేతనాలు త్వరగా మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నాం.

– స్వచ్ఛ కార్మికులు, ఆదిలాబాద్

'సీసీఐ'పై ఆశలు

- ఫ్యాక్టరీ పునరుద్ధరణ దిశగా అడుగులు
- హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష
- హాజరైన సీసీఐ సీఎండీ, స్థానిక ఎమ్మెల్యే శంకర్



సీసీఐ సీఎండీ సంజయ్ బంగాకు స్వాగతం పలుకుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్, ఎమ్మెల్యే

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీ పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి సీసీఐ పునరుద్ధరణ సాధ్యాసాధ్యాలపై తన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజాగా ఆ సంస్థ సీఎండీ సంజయ్ బంగా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. పరిశ్రమ పునరుద్ధరణ ఆవశ్యకత, అందుబాటులో ఉన్న వనరులు, చేకూరే ఉపాధి వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. పరిశ్రమ పునరుద్ధరణకు అవసరమైన డీపీఆర్ సిద్ధం చేసి, త్వరలోనే ఢిల్లీ స్థాయిలో మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఈ పరిణామాలు జిల్లా వాసుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి.

కేంద్రం ఆధ్వర్యంలోనే...

27 ఏళ్ల క్రితం మూతపడ్డ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించడం, ఆ దిశగా వరుస సమీక్షలు నిర్వహిస్తుండడంతో ఈ ప్రాంతవాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఫ్యాక్టరీ పునరుద్ధరణ ప్రతిపాదనలను పరిశీలించారు. పాత యంత్రాలు శిథిలావస్థకు చేరినందున అధునాతన యంత్రాలతో ప్లాంట్ పునరుద్ధరించాలని నిర్ణయించినట్లుగా సమాచారం. ఇందుకు సుమారు రూ.2వేల కోట్ల వరకు వ్యయం అవసరమవుతుందని యాజమాన్యం వెల్లడించినట్లుగా తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ముందుకు సాగాలా.. లేక కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలా.. అలా కానిపక్షంలో పీపీపీ విధానంలో ముందుకు వెళ్లాలనే మూడు అంశాలపై ఇందులో చర్చించినట్లుగా సమాచారం. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్రం ముందుకు వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా మంత్రి శ్రీధర్‌బాబు తెలిపినట్లుగా తెలిసింది. పరిశ్రమ రీ ఓపెన్ అయితే ప్రత్యక్షంగా సుమారు 3వేల మందికి పరోక్షంగా మరో ఐదారువేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. మరో వందేళ్ల పాటు అవసరమైన సున్నపురాయి నిల్వలు స్థానికంగా అందుబాటులో ఉన్నందున కేంద్రం ఆధ్వర్యంలోనే పునరుద్ధరణ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తోంది.

కేంద్రం సానుకూలం..



ఆదిలాబాద్ జిల్లా వెనుకబడిన ప్రాంతం. ఫ్యాక్టరీ పునరుద్ధరణ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశముంది. ఈ క్రమంలోనే పరిశ్రమను తిరిగి తెరిపించేందుకు కేంద్రం సానుకూలంగా ఉంది.రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన వాటర్, ఎలక్ట్రిసిటి, ప్రాపర్టీ ట్యాక్స్ వంటివి రూ.15కోట్లు బకాయిపడ్డాయి. వాటిని విడుదల చేయాల ని ఇటీవల మంత్రిశ్రీధర్‌బాబుతో మాట్లాడి కోరడం జరిగింది. ఇందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కూడా సానుకూలత వ్యక్తం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర భాగస్వామ్యంతో ఫ్యాక్టరీని తిరిగితెరిపిస్తాం.

– గోడం నగేశ్, ఎంపీ, ఆదిలాబాద్

అన్ని అంశాలను దృష్టికి తీసుకెళ్లా..



జిల్లా కేంద్రంలో మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు కేంద్రం పూర్తి సానుకూలంగా ఉంది. సీసీఐ చైర్మన్ విషయాన్ని స్పష్టంగా తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఉన్న సానుకూలత, వనరులు, కలిగే ప్రయోజనాలను చైర్మన్‌తో పాటు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులు, అధికారులను కలిసి చర్చిస్తాం.

– ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్

పత్తి దిగుబడి అంచనాకు జిల్లాస్థాయి కమిటీ

కైలాస్‌నగర్: పత్తి మార్కెటింగ్ సీజన్ 2025–26కు సంబంధించి జిల్లా సగటు పత్తి దిగుబడిని ఖచ్చితంగా అంచనా వేసేందుకోసం జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లుగా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టర్ చైర్మన్‌గా, వ్యవసాయాధికారి కన్వీనర్‌గా, మార్కెటింగ్ ఏడీ, సీపీఓ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కమిటీ ద్వారా సేకరించిన సమాచారాన్ని సీసీఐకి అందించనున్నట్లు తెలిపారు. ఈ సీజన్‌లో విత్తిన విస్తీర్ణం, అంచనా దిగుబడి, ఉత్పత్తి వివరాలను మండలాల వారీగా సేకరించాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. రైతులు, ఎఫ్‌పీవోలు , వ్యవసాయ నిపుణులు పంట కోత ప్రయోగాల ద్వారా వాస్తవిక అంచనాకు రావడం జరుగుతుందన్నారు. ఇందులో డీఏవో శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, అఖిలపక్ష రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితా వివరాలను వివరించారు. ఇందులో జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో కలెక్టర్‌కు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: కలెక్టర్ రాజర్షిషా సోమవారం రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం వాకింగ్ చేసే సమయంలో ఎడమ కాలుకు గాయం కావడంతో ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం రెండు వారాలు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు కలెక్టర్‌కు సూచించినట్లు సమాచారం. కలెక్టర్ వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు కళ్యాణ్‌రెడ్డి, శరత్‌రావు తదితరులున్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

తాంసి: రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లాకు సరిపడా ఎరువు ఈ నెల 10న వస్తున్నట్లు తెలిపారు. 11వ తేదీ నుంచి రైతులకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా రైతులకు అవసరమైన యూరియా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రెండు నెలలకు సరిపడా ఎరువు జిల్లా కేంద్రానికి త్వరలోనే పంపనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చెప్పారని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నారాయణ, సంతోష్, తదితరులున్నారు.

మళ్లీ టీచర్ల సర్దుబాటు

- పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలు
- జిల్లాలో రెండో విడతలో 35 మందికి..
- నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు విద్యాశాఖ మరోసారి చర్యలు చేపట్టింది. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో అవసరానికి మించి పనిచేస్తున్న టీచర్లను గుర్తించింది. అయితే ఇప్పటికే మొదటి విడత సర్దుబాటు ప్రక్రియలో 131 మందిని అవసరం ఉన్న పాఠశాలలకు కేటాయించారు. ఇటీవల 76 మందికి పదోన్నతులు లభించాయి. దీంతో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. ఈనెల 4న ప్రభుత్వం మరోసారి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తొలివిడతలో గందరగోళం నేపథ్యంలో ఈ సారి ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రత్యేక కమిటీలతో పాటు ఇద్దరు మండల విద్యాధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ఇప్పటికే ప్రక్రియ తుది దశకు రాగా, నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తం 739 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 400 వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని సర్దుబాటు ద్వారా తాత్కాలికంగా భర్తీ చేసేందుకు విద్యా శాఖ జూలైలో మొదటి విడతలో 131 మందిని సర్దుబాటు చేశారు. మొదట 141 మందిని సర్దుబాటు చేయగా, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, పది మందిని అదే పాఠశాలలో కొనసాగించారు. అయితే ఆయా ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య లేకున్నా ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు చేయించుకున్నారు. ప్రస్తుతం అదే పాఠశాలలో కొనసాగుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇటీవల పదోన్నతుల ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో 101 మందికి ప్రమోషన్ లభించగా, 76 మంది మాత్రమే విధుల్లో చేరారు. 25 మంది చేరలేదు. దీంతో పాఠశాలల్లో మళ్లీ ఖాళీలు ఏర్పడ్డాయి. తాజాగా 35 మంది ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద అవసరం ఉన్న పాఠశాలలకు పంపేందుకు చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలోని కాంప్లెక్స్, మండల పరిధిలో, పక్క మండలాలకు సర్దుబాటు చేయనున్నారు. ఇటీవల పదోన్నతి పొందిన వారిలో జిల్లాలో 15 మంది పీజీహెచ్‌ఎంలు, 61 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు.



సర్దుబాటు ప్రక్రియపై కసరత్తు చేస్తున్న ఉద్యోగులు

ప్రాథమిక విద్యపై ప్రభావం..

జిల్లాలో 250 ఎస్జీటీ, 104 స్కూల్ అసిస్టెంట్, 16 పీజీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, మిగతావి వృత్తి విద్యా, ఇతర టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని ఉన్నత పాఠశాలలు, అవసరం ఉన్న ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో ప్రాథమిక విద్యా వ్యవస్థ కుంటుపడుతుంది. ఇప్పటికే 50 శాతం మంది విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయడంలో వెనకబడ్డారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కాకుండా విద్యా వలంటీర్లను నియమించాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

ప్రాథమిక	500
ప్రాథమికోన్నత	119
ఉన్నత	120
విద్యార్థులు	65,000
ఉపాధ్యాయులు	2,667
తొలివిడతలో సర్దుబాటైన టీచర్లు	131

పకడ్బందీగా ప్రక్రియ..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నాం. దాదాపు 35 మంది టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేసే అవకాశం ఉంది. ఇద్దరు ఎంఈవోల పర్యవేక్షణలో ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. మొదటి విడతలో 131 మందిని ఆయా పాఠశాలలకు కేటాయించాం. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో జిల్లాలో 76 మందికి ప్రమోషన్లు లభించాయి. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం.

– వేణుగోపాల్‌గౌడ్, విద్యాశాఖ ఏడీ

చేయూత పింఛన్ పెంచాలి

- వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ ఆవరణలో బైఠాయించిన దివ్యాంగులు

కైలాస్‌నగర్: చేయూత పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రధానద్వారం ఎదుట నిరసన తెలిపిన ఆయా సంఘాల నాయకులు, దివ్యాంగులు పోలీసులను నెట్టుకుని కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. మళ్లీ అడ్డుకోవడంతో కార్యాలయ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీడబ్ల్యూవో మిల్కా వారి వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే పింఛన్ పెంచుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది గడిచినా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రేంరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు' పట్టాలివ్వాలని సీపీఎం ధర్నా

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి రాఘవులు,నాయకులు స్వామి, గంగారాం పాల్గొన్నారు.

కొనసాగుతున్న 104 ఉద్యోగుల ఆందోళన..

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104 సేవల ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన ఆందోళన 7వ రోజుకు చేరింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ట్రెయినీ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.మల్లేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న చదరంగం పోటీలు

మందమర్రిరూరల్: పట్టణంలోని బురదగూడెంలో ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఈనెల 13న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అండర్–15 విద్యార్థులకు చదరంగం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనుకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 6305502409 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తాంసూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జాదవ్ దినేష్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. బాధితుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు ఇంటి వెనుక నుంచి లోనికి చొరబడి బీరువాలో ఉన్న ఒకటిన్నర తులాల నకలేష్, 5 గ్రాముల చెవి కమ్మలు,7 తులాల వెండి, రూ.30 వేల నగదు అపహరించారు. సోమవారం దినేష్ ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై షేక్ జుబేర్ సంఘటన స్థలాన్ని పరిశీలించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

అన్నపై హత్యాయత్నం చేసిన తమ్మునికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భూ పంచాయతీ విషయంలో అన్నపై హత్యాయత్నం చేసిన తమ్మునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీవాణి సోమవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయాల అధికారి డల్లు సింగ్ తెలిపారు. 2022లో లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన జాడ రజనీకాంత్ భూమి విషయంలో అన్నతో గొడవపడి కత్తితో దాడి చేశాడు. బాధితుని భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో రెండేళ్లు..

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలక్రైం: మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడి కులంపేరుతో దూషించిన ఒకరికి సోమవారం ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించినట్లు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి జి. రాఘవేందర్ తెలిపారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజారాంపల్లికి చెందిన గన్నేరువరం నర్సయ్య మంచిర్యాల జిల్లా సీసీసీ నాగార్జున కాలనీలో నివాసం ఉంటున్న ఎస్సీ కుటుంబానికి చెందిన ఓ మహిళ ఇంటికి గ్యాస్ డెలివరీ చేయడానికి వచ్చి ఆమెతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించాడు. మహిళ గట్టిగా అరవడంతో బైక్‌పై పారిపోయాడు. 2020 నవంబర్ 18న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జైపూర్ ఏసీపీ నర్సయ్యపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ రమణారెడ్డి 11 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చి నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మతసామరస్యాన్ని దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన కొండ గణేశ్, గౌతమ్, వాగ్మారే ప్రశాంత్, ఎం.మునీశ్వర్, మహేష్ ఎమ్మెల్యేతో పాటు అధికారులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా వాట్సాప్‌లో పోస్టులు పెట్టారని పేర్కొన్నారు. వీటిని గ్రూపుల్లో షేర్ చేసి గొడవకు దారితీసేలా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు పెట్టినా, షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లతో పాటు పోస్టులను షేర్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మతసామరస్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గురుకులంలో 16 మంది విద్యార్థులకు అస్వస్థత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నంనూర్‌లోని చందన్‌పూర్ పునరావాస కాలనీలో గల తెలంగాణ అర్బన్ గురుకుల పాఠశాలలోని 16 మంది విద్యార్థులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలోని తరగతి గదుల్లో సోమవారం దోమల నివారణకు క్రిమి సంహారక మందు స్ప్రే చేయించారు. అనంతరం లోపలికి వెళ్లిన విద్యార్థుల ముఖంపై దురదతో కూడిన దద్దుర్లు వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గమనించిన పాఠశాల యాజమాన్యం రాత్రి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గురుకుల పాఠశాలలో పరిమితికి మించి క్రిమిసంహారక మందు వినియోగించి స్ప్రే చేయించడంతో విద్యార్థుల అస్వస్థతకు గురైనట్లు తెలిసింది.

తెలంగాణ భాష.. యాసే శ్వాస

- ప్రాంతీయ మాండలికంతోనే భాషకు మనుగడ
- భాష, యాసలో ప్రత్యేకత కనబర్చుతున్న సాహితీవేత్తలు
- నేడు తెలంగాణ భాషా దినోత్సవం


బాల రచయితలతో తెలుగుభాషోపాధ్యాయుడు కొండూరి పోతన్న

తెలంగాణ యాసలో జిల్లా కవుల రచనలు కొన్ని...

'అవును...నేను ఆదిలాబాదోన్నే', మట్టిగోడలు, స్వేచ్ఛకు సంకెళ్లు, పత్తిపూలు, కచ్చురం, అడవి(నవల), కొలిమి అంటుకుంది, నిరుడు కురిసిన కళ, జంగూబాయి.

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మాతృభాష ప్రాధాన్యతను చాటేలా తెలంగాణ సంస్కృతి, సాహిత్యం, జానపద గేయాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాచీన చరిత్ర కలిగి ఉంది. సామాన్యుడి భాష, యాస ద్వారా సమస్యలపై గళం విప్పిన కాళోజీ స్ఫూర్తితో జిల్లాకు చెందిన పలువురు తెలుగు భాషోపాధ్యాయులు, కవులు, సాహితీవేత్తలు, బాలరచయితలు ప్రత్యేకత కనబర్చుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థానిక భాషల్లో వైవిధ్యం కనిపిస్తుంది. వివిధ రకాల యాసలతో పాటు భాషా మాండలికాలు వాడుకలో ఉన్నాయి. జిల్లాకు చెందిన కవులు కూడా తమ రచనల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ భాష పరిరక్షణకు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 9న సహజకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఏటా తెలంగాణ భాషాదినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం..

కవిత్వం సంక్షిప్తం...అర్థం అనంతం

నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఉపాధ్యాయులు పత్తి శివప్రసాద్ రచన ప్రత్యేకశైలి సంతరించుకుని ఉంటుంది. తెలంగాణ యాసలో సంక్షిప్త పదాలతో కూడిన వచన కవిత్వంలో వీరిది అందవేసిన చేయి. చిన్న చిన్న వాక్యాలు, పదాల్లో అనంతమైన అర్థం దాగి ఉండేలా వీరి రచనలు ఉంటాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పదవీ విరమణ పొందిన ఆయన కొన్నేళ్లుగా అవిశ్రాంత సాహితీసేవలో కొనసాగుతున్నారు. ఎనిమిది మాసాలుగా ప్రతీరోజు వీరి కలం వెంట విరిచితమవుతున్న రచనలు పలు సామాజిక మాధ్యమాల్లో సాహితీ అభిమానులు ఇష్టపడుతున్నారు.

వ్యవహారికమే భాషకు ఆయువుపట్టు...

తెలంగాణ భాషకు స్థానిక ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషనే ఆయువుపట్టుగా ఉంటుంది. తెలంగాణ యాసలో 'అవును..నేను ఆదిలాబాదోన్నే' అనే కవిత సంకలనాన్ని జిల్లాకు చెందిన సాహితీవేత్త అప్పాల చక్రధారి రచించారు. వందలాది మందితో మమేకమయ్యే సందర్భంలోనే భాషకు ఉన్న విభిన్న కోణాలు తెలుసుకోగలుగుతామని ఆయనంటారు. కవులు, రచయితలు తెలంగాణ యాస, భాష ప్రతిబింబించే రచనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా తెలంగాణ భాషను ముందు తరాలకు అందివ్వగలుగుతారు. ఉమ్మడి జిల్లా నుంచి అనేకమంది కవులు, రచయితలు వర్ధమాన సాహితీవేత్తలు ఇందుకు తమ స్థాయిలో పాటుపడుతున్నారు. నేరెళ్ల హనుమంతు, తుమ్మల దేవరావు, దామెర రాములు, మడిపెల్లి రాజ్‌కుమార్, అల్లం రాజయ్య, వసంత్‌రావు దేశ్‌పాండే, మురళీధర్, చంద్రమౌళి, సామల రాజవర్ధన్, పోలీస్ భీమేష్, ఉదారి నారాయణ, తదితర అనేకమంది ఇదే కోవలోకే చెందినవారు కావడం విశేషం.

చిట్టి రచనల్లో గట్టి అర్థం స్ఫూరించేలా...

నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ గ్రామీణ జీవన నేపథ్యం యాస, భాష, నుడికారాలతో కూడిన కథల సంపుటిని సమష్టిగా రచించి ఏడాది క్రితం పుస్తకంగా విడుదల చేశారు.. తాజాగా మరి కొంతమంది విద్యార్థులు 'అంకురాలు–2' పేరిట మరో పుస్తకాన్ని విడుదల చేసేందుకు శ్రమిస్తున్నారు.. అక్కడి తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న మార్గనిర్దేశంలో చిన్నారులంతా కలిసి తెలంగాణ భాష, సంస్కృతిపై వారికున్న మక్కువతోనే కథల సంపుటిని రచించి త్వరలో పాఠకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. గతంలో విడుదల చేసిన తొలి కథల సంపుటిలో చక్కని గ్రామీణ నేపథ్యంతో కూడిన ఇతివృత్తాలను కథాంశాలుగా స్వీకరించి తెలంగాణ యాస, సంభాషణలను గ్రామీణ రైతుల కష్టాలు, జీవనవిధానం స్ఫూరించేలా చేసిన వీరి రచనలు రాష్ట్రస్థాయిలో పలువురు రచయితలు, సాహితీవేత్తల ప్రశంసలు పొందాయి.

నువ్వు లేక నేను లేను..!

- రైలు కింద పడి యువతి బలవన్మరణం
- తట్టుకోలేక ప్రేమికుడి ఆత్మహత్య
- బావిలో దూకిన యువకుడు


మృతుడు వినయ్‌బాబు(ఫైల్)


మృతురాలు హితవర్షిణి (ఫైల్)

లక్సెట్టిపేట/సికింద్రాబాద్: ఇద్దరిదీ ఒకే ఊరు.. మనసులు కలిశాయి. ప్రేమించుకున్నారు. మనువాడాలనీ అనుకున్నారు. ఏమైందో తెలియదు గానీ యువతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణాన్ని తట్టుకోలేక ఒక్క రోజు వ్యవధిలోనే యవకుడు బావిలో దూకి బలవన్మరణం చెందాడు. పోలీసులు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన వేనంక వినయ్‌బాబు(26) డిగ్రీ పూర్తి చేశాడు. తల్లి రాజవ్వతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన దుంపటి హితవర్షిణి(20) ఇంజినీరింగ్ చదువుతోంది. వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. హితవర్షిణి కుటుంబం ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఉంటోంది.

రైలు కిందపడి యువతి..

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి అంజన్న కూతురు దుంపటి హితవర్షిణి ఘట్‌కేసర్‌లోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ ఫైనలియర్ చదువుతోంది. సెలవుల కారణంగా మూడు రోజుల క్రితం ఆర్మూర్‌కు వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం నిజామాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి మెట్రో రైలు ఎక్కి ఉప్పల్ స్టేషన్‌లో దిగింది. అక్కడి నుంచి ఆటోలో ఘట్‌కేసర్ చేరుకున్న హితవర్షిణి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై సిర్పూర్–కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపారు.

హనవ్వ దగ్గరికే వెళ్తున్నా..!

హితవర్షిణి మృతిని వేనంక వినయ్‌బాబు తట్టుకోలేకపోయాడు. మనోవేదనకు గురైన అతడు లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో సోమవారం దూకాడు. స్థానికులు గమనించి బావిలో నుంచి తీసేసరికి చనిపోయాడు. ''హనవ్వ(హితవర్షిణి) కోసం ఏం చేయడానికైనా సిద్ధం. నా పంచ ప్రాణాలు.. అందుకే హనవ్వ దగ్గరికే వెళ్తున్నా.. అమ్మా, నాన్న, బాబాయి నన్ను క్షమించండి'' అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

తెరుచుకున్న బాసర ఆలయం


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: రాహుగ్రస్త చంద్రగ్రహణం అనంతరం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సోమవారం ఉదయం 4 గంటలకు తెరిచారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, మహాసంప్రోక్షణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషేకం, మహా నివేదన, మంత్రపుష్పం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులకు అన్ని ఆర్జిత సేవలు, సర్వ దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి.

11న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 11న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం నిర్మల్ నుంచి బోథ్‌కు చేరుకుని ఇందిరమ్మ మోడల్ ఇంటిని ప్రారంభిస్తారు. పరిచయ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల కింద ఎంపికైన నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. ఇంద్రవెల్లికి చేరుకుని అమరవీరుల స్థూపాన్ని ప్రారంభిస్తారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. మధ్యాహ్నం భోరజ్ మండలం పిప్పర్‌వాడకు చేరుకుని ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి గిమ్మకు చేరుకుని రూ.13.78 కోట్ల సీఆర్ఆర్, ఎస్‌సీపీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తారు. పట్టణంలోని గాయత్రీ గార్డెన్‌లో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

సినీ ఫక్కీలో దాడికి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో కొందరు యువకులు సినీఫక్కీలో దాడి చేసేందుకు యత్నించారు. బాధితులు పారిపోవడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. టూటౌన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు ఈనెల 6న ఆదిలాబాద్ పట్టణంలోని కోలిపూరకు చెందిన గణేశ్ మండలి సభ్యులు గ్రూప్‌గా విడిపోయి పరస్పరం దాడికి పాల్పడ్డారు. సోమవారం కోలిపూరకు చెందిన ఆకుల నితీష్ అలియాస్ టిక్కు, కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠ అదే కాలనీకి చెందిన కళ్యాణ్, మురార్కర్ నవీన్, కార్తీక్‌తో పాటు పలువురిపై దాడి చేసేందుకు సింహాద్రి సినిమాలో మాదిరి సైకిల్ గేర్‌విల్‌తో తయారు చేసిన ఆయుధంతో వెళ్లారు. గమనించిన బాధితులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. ఆ తర్వాత వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మురార్కర్ నవీన్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కారింగుల సాయికిరణ్, పరివార్ మణికంఠలను అరెస్టు చేయగా ఆకుల నితీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఈ ఆయుధాన్ని తయారు చేసిన వ్యక్తిపై సైతం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తల్లిపై కుమారుడు హత్యాయత్నం

- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

తిర్యాణి: తల్లిపై కుమారుడు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తలండి గ్రామానికి చెందిన పులి భీమయ్యకు తన కుటుంబంతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తరచూ కుటుంబ సభ్యులతో భీమయ్య గొడవకు దిగేవాడు. ఆస్తికి అడ్డంగా ఉన్న తల్లి కాంతను చంపాలనే ఉద్దేశంతో ఈనెల 7న తెల్లవారు జామున ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యాడు. అప్రమత్తమైన వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. కాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం భీమయ్యను అదుపులోకి తీసుకుని ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు...

అన్నారం బ్యారేజీలో ఒకరు గల్లంతు

- నాటుపడవ బోల్తా పడడంతో ఘటన

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం బ్యారేజీలో డోంగ (నాటు పడవ) బోల్తా పడి ఒకరు గల్లంతైనట్లు పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని సిరోంచ తాలుకా మండలపురం గ్రామానికి చెందిన తూముకూరి కిష్టస్వామి, గడ్డం వెంకటేశ్ సోమవారం చెన్నూర్ మండలంలోని పొక్కూరు గ్రామానికి చెందిన చొంక సంపత్ వద్ద డోంగ (నాటు పడవ) కొనుగోలు చేశారు. అదే పడవపై ఇద్దరూ కలిసి గోదావరి నదిలో వెళ్తుండగా సుందరసాల సమీపంలోని అన్నారం బ్యారేజీ వద్దకు రాగానే నీటి ప్రవాహం ఎక్కువై పడవ తలకిందులై కొట్టుకు పోయింది. పడవలో ప్రయాణిస్తున్న కిష్టస్వామి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా వెంకటేశ్ బ్యారేజీలో గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం

రెబ్బెన: భార్య కాపురానికి రావడంలేదని భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి ఓదానందం (32)కు మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ధర్మారావుపేటకు చెందిన శైలజతో కొన్నేళ్లక్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో రెండు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం ఓదానందం తన భార్యకు నచ్చజెప్పి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులతో కలిసి అత్తారింటికి వెళ్లాడు. నిరాకరించిన శైలజ తన తల్లితో కలిసి వారిని దుర్భాషలాడింది. దీంతో తల్లిదండ్రులను తీసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం గదిలోకి వెళ్లాడు. సోమవారం ఉదయం నిద్రలేపేందుకు గది తలుపు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు శైలజతో పాటు ఆమె తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ పొలిమేరలోనే వాహనాలు


వాగుకు అవతల నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గౌరపూర్, చిత్తబట్ట గ్రామాలకు మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మించకపోవడంతో వర్షాకాలంలో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల పాటు తమ ద్విచక్ర వాహనలు, ఆటోలను వాగుకు అవతల ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటువైపు వ్యవసాయ భూములున్న రైతులు, గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారు. వాగుపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చిత్తబట్ట వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.


గౌరపూర్, చిత్తబట్ట గ్రామాల మధ్యలో వాగు

అర్జీదారుల దరఖాస్తులు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం పీవో చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆసిఫాబాద్‌కు చెందిన నిఖిల్ ల్యాప్‌టాప్ ఇప్పించాలని, సోనాల మండలం దేవునాయక్ తండాకు చెందిన లక్ష్మణ్ ఆర్వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, తాండూర్‌కు చెందిన విజయలక్ష్మి ట్రైకార్ రుణం ఇప్పించాలని, నార్నూర్ మండలం కొలాంగూడకు చెందిన జంగు టెంట్ హౌజ్ కోసం, గాదిగూడకు చెందిన శిరీష ఇల్లు మంజూరు కోసం అర్జీలు సమర్పించారు.

ల్యాప్‌టాప్‌లు పంపిణీ

ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రతిభ కనబర్చిన ఉట్నూర్ మండలంలోని ఎనిమిది మంది గిరిజన విద్యార్థులకు సోమవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసినట్లు పీవో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జక్కుల అశ్విన్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈనెల 7న గోలేటిలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 4వ సబ్ జూనియర్ బాలబాలికల అండర్–14 పోటీల్లో ప్రతిభ కనబరిచి జనగామ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సదరు విద్యార్థిని సోమవారం అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ జిల్లా కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మందమర్రి సీఐఎస్ఎఫ్ బరాక్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 2వ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో సదరు పాఠశాల విద్యార్థినులు అశ్విత, పి.నేహ, ఆర్.మనస్విని స్వర్ణ పతకాలు, బి.సింధు, ఎస్. కీర్తన, బి.అక్షర, హన్షిత, లౌక్యశ్రీలు రజత పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సదరు విద్యార్థులను, కరాటే మాస్టర్ రవిని ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

15న లాభాల వాటా కోసం ధర్నా

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికులకు కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ కేంద్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. సోమవారం ఆర్కే 5 గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. కంపెనీ లాభాల వాటా చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ఏప్రిల్ 1నే ఉత్పత్తిని ప్రకటిస్తున్న అధికారులు లాభాలను మాత్రం ప్రకటించడానికి నెలలు గడుపుతున్నారన్నారు. వాస్తవ లాభాలను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో సొంతింటి పథకంపై తమ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల అభిప్రాయ సేకరణకు బ్యాలెట్ విధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు వెంగల శ్రీనివాస్, సురేందర్, ఇప్ప నరేష్, తిరుపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

35 శాతం లాభాల వాటా ఇవ్వాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట: గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన లాభాలు ప్రకటించి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత సీఅండ్ఎండీతో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో సొంతింటి పథకం అమలు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డిస్మిస్ అయిన జేఎంటీలను విధుల్లోకి తీసుకునేందుకు సర్క్యులర్ జారీ అయ్యిందన్నారు. ఇతర ఉద్యోగులకు సైతం ఐదేళ్లలో వంద మస్టర్లు ఉంటే విధుల్లోకి తీసుకునేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. ఈనెల 12న సీఅండ్ఎండీతో జరిగే సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రాజేందర్, లింగయ్య, రఘురాం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి

భీంపూర్: మండలంలోని భగవాన్‌పూర్‌లో నవజాత శిశువు మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రియాంకకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో అంబులెన్స్ రావడంలో ఆలస్యమైంది. దీంతో మహిళ ఇంటివద్దే ప్రసవించగా శిశువు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుమార్గాన్ని బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్..

కుభీర్: ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని లింగి గ్రామానికి చెందిన కె.గంగాధర్ (33) సోమవారం సాయంత్రం ఆటోలో సిమెంటు బస్తాలు వేసుకుని భైంసా నుంచి వస్తుండగా సాంవ్లి గ్రామం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో మహిళ..


జానాబాయి (ఫైల్)

వాంకిడి: పొలం పనులకు వెళ్లిన ఓ మహిళను పాము కాటువేయడంతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వడ్గురే జానాబాయి(34), శంకర్ దంపతులు ఆదివారం పంటచేసుకు వెళ్లారు. సాయంత్రం పనులు చేస్తుండగా జానాబాయిని పాము కాటు వేసింది. ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.